మధ్యాహ్న భోజనంపై సీరియస్

- ఉడకని కోడిగుడ్లు, పురుగు పట్టిన బియ్యం
- ఇంటి నుంచే లంచ్ తెచ్చుకుంటున్న 70 మంది విద్యార్థులు
- గోడు వెల్లబోసుకున్న పిల్లలు
- ప్రిన్సిపాల్‌ను హెచ్చరించిన కలెక్టర్ సత్యశారద

గీసుగొండ: నేలపై ఉన్న కూరగాయలను చూసి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ సత్యశారద

గీసుగొండ, ఫిబ్రవరి 5: మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్‌ను బుధవారం కలెక్టర్ సత్యశారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో కలెక్టర్ పాఠశాలకు రావడంతో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. రోజూ రుచిపచి లేని కూరలు, ఉడకని కోడిగుడ్లు, సాంబార్‌తో తమకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని విద్యార్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు. స్కూల్‌లో 300 మంది విద్యార్థులుంటే భోజనం సరిగా లేదని 70 మంది పిల్లలు ఇంటి నుంచే లంచ్ తెచ్చుకుంటున్నారని విద్యార్థులు చెప్పారు. ఈ విషయంలో ప్రిన్సిపాల్ సునీతపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అసలు పాఠశాలల్లో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. మీరు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అక్కడి నుంచి స్టోర్ రూం, క్లాస్ రూంలను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. సాంబార్ రుచిగా లేదని, బియ్యం బస్తాల్లో పురుగులు ఉండడం, సరిగా ఉడకని అన్నం, శుభ్రత లేని క్లాస్ రూములను చూసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిని ఇలాగే ఉంచుకుంటారా అని సిబ్బందిని ప్రశ్నించారు. వారం రోజుల్లో మళ్లీ వస్తానని, పరిస్థితి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. నిత్యం పాఠశాలలను తనిఖీ చేయాలని డీఈవోను ఆదేశించారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

ఖిలావరంగల్: నులిపురుగుల నివారణకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. జిల్లాలో 1810 పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారు 1,81,807 మంది ఉన్నట్లు చెప్పారు. వీరందరికీ ఈ నెల 10న అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే పిల్లలకు మాత్రలు వేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో కౌసల్యాదేవి, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో పీఎంశ్రీ, సర్వశిక్షా అభియాన్ పథకాల ద్వారా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, మరమ్మతుల పురోగతిపై సమీక్షించారు. పీఎంశ్రీ పథకంలో పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 1.38 కోట్లతో మంజూరైన 14 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే, సర్వశిక్షా అభియాన్ పథకంలో రూ. 3 కోట్ల వ్యయంతో 12 ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబరేటరీల ఏర్పాటు పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. సమీక్షలో డీఈవో జ్ఞానేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నల్లబెల్లి, ఫిబ్రవరి 5: ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే తమ కుటుంబాలకు ఆత్మహత్యలే శరణ్యమని ఈ పంచాయతీ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో నర్సింహమూర్తి, ఎంపీవో రవికి ఆపరేటర్లు మార్త నరేశ్, రజినీకాంతరెడ్డి, నాగరాజు వినతిపత్రం అందజేశారు.

సేవాలాల్ జయంతికి సెలవు ఇవ్వాలి

గీసుగొండ, ఫిబ్రవరి 5: గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సేవాలాల్ జయంతి పోస్టర్లు ఆవిష్కరించారు. భరత్, రేవంత్, రాఘవేంద్ర. రాజు, వెంకన్న పాల్గొన్నారు.

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE AT HANAMKONDA
O.S. NO. 1272 OF 2022
Between:
Girimalla Kanaka Rajamma & others ...Plaintiffs
And
Karre Chandraiah & others ...Defendants
NOTICE
To
Karre Chandraiah, S/o. Late Lingaiah, Aged 58 years, R/o. Gopalapur Village, Elkathurthy Mandal, Hanamkonda District, presently Residing at Vangara Village, Bheemadevarapally Mandal, Hanamkonda District (Defendant No. 1).
Please take notice that the above suit filed by the plaintiff herein against you and others and the said case is posted on 28-02-2025 for your appearance. Therefore, you are hereby ordered to appear before the said Court on the above said date at 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided exparte.
//By Order of the Court//
Sd/- PANJALA SAMMAIAH, B.L., MHRM
Er.No. TS/1281/1996, Advocate
H.No. 2-9-34, Vikas Nagar, Hanamkonda, Warangal, TS,
Cell: 9849694661.

బీసీ కుల జనగణన కోసం తీర్మానం చేయాలి

- 56 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి
- జనాభా ప్రకారం ఉద్యోగ రిజర్వేషన్ ఇవ్వాలి
- బీసీలకు రూ. 10 లక్షలతో పక్కా ఇండ్లు నిర్మించాలి
- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి

ఖిలావరంగల్: కలెక్టరేట్‌లో డీఆర్వో విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 5: దేశంలో బీసీల కుల జనగణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి కోరారు. దేశంలో బీసీల కుల జనగణతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కుల గణన ప్రకారం బీసీలకు 56 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల జనగణన చేయకుండానే మోదీ ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యూఎస్ అమలు చేస్తుందన్నారు. 2021లో జరపాల్సిన కుల జన సర్వేను కరోనా వల్ల కేంద్రం వాయిదా వేసిందన్నారు. 2025లో కుల జన గణన చేసి దామాషా ప్రకారం ఆయా కులాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే, చట్టసభలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగాల్లో ఎవరి వాటా వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజనలో బీసీలకు రూ. 10 లక్షలతో పక్కా ఇండ్ల పథకం అమలు చేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నర్సరీ నుంచి పీజీ వరకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఫీజునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించేలా చట్టసవరణ చేయాలన్నారు. బీసీ వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఓర్సు రాజు, జిల్లా సహాయ కార్యదర్శులు చీకటి ప్రకాశ్, బొట్ల శ్రీనివాస్, బచ్చలి స్వప్న, వైశాలి, వీరస్వామి, చింతకింది శ్రీహరి, కట్కోజు చంద్రశేఖర్, పరికరాల రమేశ్ పాల్గొన్నారు.

బీసీల వాటాపై బిల్లు తేవాలి

పోచమ్మమైదాన్: బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని, చట్టసభల్లో బీసీ వాటాపై పార్లమెంట్‌లో బిల్లు తీసుకురావాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నిర్మాణవాది పంజాల రమేశ్ డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మేడిద అశోక్ అధ్యక్షతన జరిగి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కులగణన చేపట్టి బీసీ జనాభాను తేల్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నట్లు తేల్చినందున స్థానిక సంస్థల ఎన్నికల్లో 56 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, విజయ్, రాజేశ్, ఎస్‌కే అంజత్, స్వప్న, సుజాత పాల్గొన్నారు.

కులగణన ప్రకారం రిజర్వేషన్లు అందించాలి

నర్సంపేట: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి నర్సంపేట పట్టణ కన్వీనర్ మహాదేవుని జగదీశ్ డిమాండ్ చేశారు. తొలుత బీసీ హక్కుల సాధన సమితి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బీసీల హక్కుల సాధన, పరిరక్షణ కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో ఉమారాణికి బీసీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశంలో బీసీలు 56 శాతం ఉన్నారని ప్రకటించి రిజర్వేషన్ అమలు చేయకుండా చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్ కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు ఓర్సు సాంబయ్య, ఆకారపు మోహన్, షేర్ల శ్రీనివాస్, కూచన రవీందర్, ఇల్లందుల సాంబయ్య, వెంకన్న, అనూష, అరుణ, పద్మ, స్వప్న, రాజు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో రిజర్వేషన్ అమలు చేయాలి

రాజ్‌కుమార్

దుగ్గొండి, ఫిబ్రవరి 5: కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు చిత్తశుద్ధితో అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ ఎన్నారై విభాగం కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో బీసీల జనాభా రెండు లక్షలు మాత్రమే పెరిగిందని చెప్పి, బీసీల హక్కులను హరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చేపట్టిన సర్వే వాస్తవ విరుద్ధంగా ఉందని, అంకెల గారడిగా బీసీల లెక్కలు చూపుతున్నారని విమర్శించారు. అసంబద్ధంగా సర్వే వివరాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు.

శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది

అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్ మృతి

పలు బాధిత కుటుంబాలకు పెద్ది పరామర్శ

నర్సంపేట, ఫిబ్రవరి 5: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మందుల శ్రీనివాస్(51) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలతో కలిసి శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పెద్ది వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగిల్లి వెంకటనారాయణగౌడ్, జిల్లా నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు. అలాగే, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ వేల్పుగొండ రాజు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, పెద్ది పరామర్శించారు. అదేవిధంగా 12వ వార్డు పరిధిలోని కొల్లూరి సమ్మారావు సతీమణి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని, ప్రభాకర్‌రావు మనవరాలు ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సుదర్శన్ రెడ్డి పరామర్శించారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఖిలావరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన ఖిలావరంగల్ ఈద్గా అధ్యక్షుడు

కరీమాబాద్, ఫిబ్రవరి 5: వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ సాయబ్‌ను ఖిలావరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో ఈద్గా కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖిలావరంగల్ ఈద్గా, ఖబ్రస్తాన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఈద్గా ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా, సాకరాశికుంట కబ్రస్తాన్ అధ్యక్షుడు హసన్ అలీబేగ్, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, ఉపాధ్యక్షుడు మగ్దూం, ఖిలావరంగల్ ఈద్గా మస్జిద్ అధ్యక్షుడు అర్పత్, నాయకులు యాకూబ్, సాదిక్ రిజ్వాన్‌ఖాన్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీ

పర్వతగిరి, ఫిబ్రవరి 5: మండలంలోని ఏనుగల్లుకు చెందిన మారుతీ రైస్ మిల్లు, విజయలక్ష్మి బిన్నీ రైస్‌మిల్లును అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించి, వడ్లు, బియ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని వెంటనే సివిల్ సప్లయ్ గోదాములకు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, సివిల్ సప్లయ్ అధికారులు మధు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి: గ్రేటర్ కమిషనర్

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 5: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. వరంగల్ 27వ డివిజన్ పరిధిలోని బాపూజీ విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కాకతీయ టౌన్ దివ్యాంగుల సమాఖ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘాల్లో సభ్యులుగా లేని దివ్యాంగులు కొత్త సంఘాల ఏర్పాటుకు మెప్మా అధికారులు పూర్తి సహకారం అందిస్తారన్నారు. దివ్యాంగులు సంకల్ప బలంతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, రాజేశ్వర్, మెప్మా టీఎంసీ రమేశ్, సీవో రాజ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

16న విద్యార్థులకు 'చిగురు' కార్యక్రమం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 5: యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు కాజీపేటలోని నిట్‌లో 'చిగురు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా మాదిరిగా విద్యార్థులను వివిధ విద్యేతర కార్యక్రమాల్లో ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 15 రకాల పోటీలు నిర్వహించి, అదేరోజు బహుమతి ప్రదానం చేస్తామని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నర్సంపేట, ఫిబ్రవరి 5: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ టి.రమేశ్ అన్నారు. ద్వారకపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహం, వంట గదులు, స్టోరూంను పరిశీలించారు. వంట సరుకుల నాణ్యతను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అదేవిధంగా కళాశాలలోని ఇంటర్ ల్యాబ్‌ను డీఐఈవో సుమన్ శ్రీధర్ పరిశీలించారు.

పరపతి సంఘంలో రూ. 5.50 కోట్ల కుంభకోణం

రికవరీకి సభ్యుల డిమాండ్.. పెద్దమనుషుల తీర్మానం

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5: వరంగల్ ఓసిటీలోని పరపతి సంఘంలో రూ. 5.50 కోట్ల కుంభకోణం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని హైపత్‌పల్లికి చెందిన కొందరు వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో అడ్డి వ్యాపారం చేస్తూ కాశీబుగ్గ, ఓసిటీలో స్థిరపడ్డారు. 1998లో హెచ్‌బీపీ ఫ్రెండ్స్ అసోసియేషన్‌ను 25 మందితో ఏర్పాటు చేసి నెలకు రూ. వంద పొదుపు చేస్తున్నారు. ప్రస్తుతం 284 మంది సభ్యులు ఉండగా, నెలకు రూ. 300 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి సభ్యుడి వాటా మూలధనం రూ. 5,15,355 ఉంది. ఇందులో హైపత్‌పల్లితోపాటు పక్క గ్రామాల వారు సభ్యులుగా చేరారు. అడ్డి సెక్షన్ ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. 2011లో సంఘం సభ్యుల మధ్య గొడవలు జరిగి రెండుగా చీలిపోయారు. సద్దుమణిగిన తర్వాత 2016లో సంఘం భవనంతోపాటు జిమ్ సెంటర్ ఏర్పాటుకు స్థలం కొనుగోలు చేశారు. స్థల విషయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో 70 మంది సంఘం నుంచి తప్పుకున్నారు. 2019 నుంచి కంచ రమేశ్ కోశాధికారిగా వ్యవహరిస్తున్నాడు. అప్పటి నుంచి లెక్కల్లో జప్యం చేస్తున్నాడు. ఇద్దరు ఆడిటర్లతో లెక్కలు చేయించగా సుమారు రూ. 5.50 కోట్లు తక్కువ వచ్చింది. సంఘం సభ్యుల ఒత్తిడి పెరగడంతో బుధవారం సమావేశమయ్యారు. సభ్యులు నిర్వాహకులను నిలదీశారు. రికవరీ చేయాలని పెద్ద మనుషుల సమక్షంలో నిర్ణయించుకున్నారు. కోశాధికారి కంచ రమేశ్ ఆస్తులు అమ్మి జమ చేస్తామని, తక్కువ పడితే అధ్యక్షుడు భరించాలని సభ్యులకు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రాకేశ్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

పర్వతగిరి, ఫిబ్రవరి 5: మండలంలోని చింతనెక్కొండలో ఇటీవల మృతి చెందిన ప్రభాకర్ కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం గ్రామంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో బీఆర్ఎస్ యువ నాయకుడు అశోక్ నాయక్ మిత్ర బృందం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గటిక సుష్మా మహేశ్, ఉపసర్పంచ్ దేవేందర్, నాయకులు గట్టయ్య, ప్రసాద్, నరేశ్, రాజు, రాము, శేఖర్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..

చెరువులో మునిగి యువకుడి మృతి

రంజిత్(ఫైల్)

దుగ్గొండి, ఫిబ్రవరి 5: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మైసంపల్లిలో జరిగింది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల రంజిత్(30) తాత మల్లయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియలకు హాజరైన రంజిత్ పర్లపాటి చెరువులో స్నానం చేస్తుండగా చేపలు పట్టే వల కాలుకు చిక్కి మునిగిపోయాడు. బంధువులు గమనించి యువకుడిని ఒడ్డుకు చేర్చి, కొన ఊపిరితో ఉన్న అతడిని వరంగల్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రంజిత్ తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై కొరవడిన పరిజ్ఞానం'

నల్లబెల్లి, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి కనీస పరిజ్ఞానం కొరవడిందని మాలమహానాడు సీనియర్ నాయకుడు భట్టు సాంబయ్య ఆరోపించారు. అన్నతమ్ములుగా ఉన్న ఎస్సీలను విభజిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ముప్పు కృష్ణకు వినతిపత్రం అందజేశారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

చెక్కు అందజేస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, ఫిబ్రవరి 5: కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటానని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం దేశంలోనే మొదటిదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఏనుగల్లు ఏబీతండా శివారు నర్రగొడ్ల తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అసవత్ లక్ష్మణ్ మృతి చెందాడు. అతడికి పార్టీ తరపున మంజూరైన రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు దయాకర్‌రావు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ కార్యకర్తలకు ఏదైనా జరిగితే కుటుంబాలు రోడ్డున పడొద్దనే ఉద్దేశంతో ఎంతో ముందు చూపుతో కేసీఆర్ బీమా సౌకర్యం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యుగేంధర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడ్గుల రాజు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, ఈర్యానాయక్, ఏర్పుల శ్రీనివాస్, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

రాయపర్తి: మండలంలోని శివరామపురంలో ఇటీవల మృతి చెందిన చెడుపాక దయాకర్, గదారి వెంకటయ్య కుటుంబాలను ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, చెడుపాక కుమారస్వామి, బాధావత్ వీరూనాయక్, పెండ్లి వెంకన్న ఉన్నారు.

పాత ముగ్దుంపురాన్ని గురిజాలలో కలపాల్సిందే

బీఆర్ఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి

మాట్లాడుతున్న మోటూరి రవి

నర్సంపేట, ఫిబ్రవరి 5: మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీ పరిధిలో కలపాలనే నిర్ణయాన్ని వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని న్యాయవాది, బీఆర్ఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి డిమాండ్ చేశారు. గురిజాలలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత ముగ్దుంపురాన్ని ప్రత్యేక ఎంపీటీసీగా ఏర్పాటు చేయాలని, లేదంటే చెన్నారావుపేట మండలంలో కలపాలన్నారు. గురిజాలలో కలవడం పాత ముగ్దుంపురం గ్రామస్తులకు ఏమాత్రం ఇష్టం లేదన్నారు. గ్రామస్తుల అభిప్రాయాన్ని గౌరవించి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిన్నపల్లి నర్సింగం, మాజీ ఎంపీటీసీ గడ్డం కొమురయ్య, రైతుబంధు సమితి గ్రామ మాజీ కన్వీనర్ అన్న రాజమల్లు, పార్టీ మండల ఉపాధ్యక్షులు అల్లి రవి, గడ్డం రాజు, గౌడ సంఘం అధ్యక్షుడు మంచిక దేవేందర్, కురుమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎడ్ల రవీందర్, మాజీ వార్డు సభ్యులు రమేశ్, పూర్ణకుమార్, శ్రీకాంత్, అశోక్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.

లఢాక్ టీం సభ్యులతో అధికారులు, మహిళా సంఘం సభ్యులు

మహిళా సంఘాల పనితీరు భేష్

కితాబిచ్చిన మహిళా సంఘాల ప్రతినిధుల బృందం

నర్సంపేట, ఫిబ్రవరి 5: తెలంగాణలోని మహిళా సంఘాల పనితీరు చాలా బాగుందని లఢాక్ కేంద్ర పాలిత ప్రాంత మహిళా సంఘాల ప్రతినిధుల బృందం సభ్యులు కితాబిచ్చారు. మండలంలోని ముత్తోజిపేటలో బుధవారం 18 మందితో కూడిన లఢాక్ మహిళా సంఘాల ప్రతినిధుల టీం సభ్యులు సందడి చేశారు. జీపీ కార్యాలయంలో స్థానిక మహిళా సంఘం సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సంఘం కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, పుస్తకాల నిర్వహణ, రుణాల చెల్లింపు, జమ, కొత్త అప్పుల మంజూరు, వీవో పని తీరు, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎ